కమ్మర్‌పల్లిలో మహిళల పూల స్వాగతం మధ్య ముందుకు కదులుతున్న బస్సు యాత్ర

కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు వేల్పూర్ మండలంలో దారి పొడుగునా పూలతో సిద్ధంగా ఉన్న మహిళలు

ఆర్మూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్.. బస్సులో వేముల, బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి

పూలు చల్లుతూ.. హారతులు పడుతూ..

గులాబీ బాస్‌కు ఘన స్వాగతం

మోర్తాడ్/వేల్పూర్/ఆర్మూర్ టౌన్/ వినాయక్‌నగర్/ ఖలీల్‌వాడి, మే 6 : జిల్లా కేంద్రంలో రోడ్ షో నేపథ్యంలో గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. జగిత్యాల జిల్లా నుంచి జిల్లాలోని కమ్మర్‌పల్లికి సాయంత్రం 6.30 గంటలకు చేరుకున్నారు. కేసీఆర్ కాన్వాయ్‌కి మహిళలు మంగళహారతులు పట్టారు. పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. అనంతరం బస్సులో వేల్పూర్ మండలం, ఆర్మూర్ మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు వద్ద నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పటాకులు కాలుస్తూ, బస్సుపై పూల వర్షం కురిపించారు. విద్యుత్ నగర్, కంఠేశ్వర్, కంఠేశ్వర్ క్రిస్టియన్ కాలనీ చౌరస్తా, అయ్యప్ప ఆలయం, విజయ్ థియేటర్ చౌరస్తా, ధర్నా చౌక్ మీదుగా కోర్టు చౌరస్తా వద్దకు రోడ్‌షో చేరుకున్నది. అప్పటికే జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి.. కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు 'జై కేసీఆర్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బస్సులో నుంచి కేసీఆర్ అభివాదం చేస్తూ చిరునవ్వుతో ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బస్సు వెంబడి యువకులతోపాటు పిల్లలు, వృద్ధులు సైతం గులాబీ జెండాలను చేతపట్టుకొని పరుగుపెడుతూ కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కేసీఆర్ కాన్వాయ్ వెళ్తున్నంత సేపు జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలు హోరెత్తాయి.

- **జనసముద్రం :**
  జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ జనసముద్రాన్ని తలపించింది. ఎక్కడిప్రజలు అక్కడే నిలబడి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు.
- **దద్దరిల్లిన నెహ్రూపార్క్**
  రోడ్‌షోలో కేసీఆర్ స్పీచ్‌ను ప్రారంభించగానే ప్రజల అరుపులు, కేకలతో నెహ్రూపార్క్, గాంధీ చౌక్ దద్దరిల్లింది. నగరమంతా జెండాలతో గులాబీమయమైంది.
- **అలరించిన కళాకారుల ఆటపాట**
  రోడ్‌షో సందర్భంగా కళాకారుల ఆటపాట కార్యకర్తల్లో ఉత్సాహం నిపింది. మళ్లీ కారు రావాలే.. సారు కావాలే అంటూ కార్యకర్తలు నృత్యాలు చేశారు.
- కేసీఆర్ నెహ్రూపార్క్ వద్దకు రాత్రి 8.30 గంటలకు చేరుకున్నారు. 8.35 గంటలకు ప్రజలకు అభివాదం చేశారు. 8.40 నుంచి 9 గంటల వరకు ప్రసంగించారు. 9.6 గంటలకు ఇండ్లకు క్షేమంగా వెళ్లాలని సూచించిన కేసీఆర్.. ప్రజలకు అభివాదం చేశారు.

జిల్లాకేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద చేతులెత్తి బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజలు

కేసీఆర్‌ను చూడగానే కేరింతలు కొడుతున్న యువకులు

చాయ్ తాగుతూ..బాజిరెడ్డి సందడి

మోర్తాడ్/ఆర్మూర్ టౌన్, మే 6: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు కమ్మర్‌పల్లికి చేరుకున్న పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్.. వచ్చీ రాగానే సందడి చేశారు. అందరితో కలిసి హోటల్‌లో చాయ్ తాగుతూ హడావుడిగా కనిపించారు. బస్టాండ్ ప్రాంతంలోని షాపులకు వెళ్లి ప్రచారం చేశారు. ఆర్మూర్‌లో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ బస్సు యాత్రకు స్వాగతం పలికారు.



ఆర్మూర్‌లో కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మహిళలు



కేసీఆర్‌ను తమ ఇంట్లోకి ఆహ్వానిస్తున్న బిగాల సోదరులు

బిగాల నివాసంలో కేసీఆర్ బస

జిల్లాకేంద్రంలో రోడ్ షో ముగిసిన అనంతరం కేసీఆర్ సోమవారం రాత్రి నగరంలోని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నివాసంలో బస చేశారు. ఈ సందర్భంగా బిగాల సోదరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాకేంద్రానికి చెందిన ముఖ్యనేతలు కేసీఆర్‌ను కలిశారు.

బాజిరెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం

ఎడపల్లి/నందిపేట్/ డిచ్‌పల్లి/ ఇందల్వాయి/ వర్ని, మే 6 : బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఎడపల్లి మండలం నెహ్రూ నగర్ గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్‌ఖాన్, నాయకులు ఆకుల శ్రీనివాస్, శేఖర్ రాజు, తెలంగాణ శంకర్ పాల్గొన్నారు. నందిపేట్ మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు హుస్నొద్దీన్, భాస్కర్, సంతోష్ ప్రచారం చేశారు. డిచ్‌పల్లి మండలంలోని న్యాక తండాలో ముమ్మర ప్రచారం చేశారు. ఇందల్వాయి మండలంలోని గంగారాం తండా, ఇందల్వాయి స్టేషన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అనంతరం గంగారాం తండాలో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రాంతంలో కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతల దాసు, శ్రీను, బీరీష్, గంగాధర్ పాల్గొన్నారు. వర్ని మండలంలోని కూనీపూర్‌లో ఉపాధి హామీ కూలీలకు బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను వివరించారు. మండలంలోని అంతాపూర్ తండా, పొట్టి గుట్ట తండాల్లో గిరిజన నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో కూనీపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు గిరి ప్రభాకర్, బానోత్ నర్సింగ్, మోతీలాల్, కిశోర్, రామకృష్ణ పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో ప్రచారం చేస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

న్యాకతండాలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రత్యేక న్యాయమూర్తి శేషతల్పసాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

న్యాయమూర్తికి సన్మానం

బోధన్, మే 6: బోధన్ ప్రత్యేక న్యాయమూర్తిగా నియమితులైన శేషతల్పసాయిని పట్టణంలోని బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. న్యాయమూర్తికి తమ సహకారం అందించడంతోపాటు ఆయన సూచనలను పాటిస్తామని అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఈరడి పోశెట్టి, సంయుక్త కార్యదర్శి వాజిద్ హుస్సేన్, కోశాధికారి శ్రీధర్‌బాబు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి డాక్టర్ సమ్మయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

★SALINLA DAS S/o SALINLA SAIANA, H.No.3-22/1. నల్లూర్. మం॥ముప్కాల్ నా యొక్క పాస్‌పోర్ట్ నెం. H3205341. ముప్కాల్ నుండి నల్లూర్‌కు ఆటోలో వస్తుండగా పోయినది. దొరికినవారు Pls Call: 9849825836

NTZ-324801

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

డీఎంహెచ్‌వో రాథోడ్ తుకారం

నవీపేట, మే 6: హెల్త్ సెంటర్లలో విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పమని డీఎంహెచ్‌వో రాథోడ్ తుకారాం హెచ్చరించారు. మండలంలోని పలు సబ్ సెంటర్లను సోమవారం తనిఖీ చేసిన అనంతరం బినోలా సీహెచ్‌సీ సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గతేడాది 144 ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇచ్చి జిల్లా వ్యాప్తంగా 200లకు పైగా ఉన్న సబ్‌సెంటర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో కొందరు డ్యూటీలకు సక్రమంగా హాజరుకావడంలేదని ఫిర్యాదులు అందాయని, ఈ విషయం తనిఖీల్లో కూడా బయటపడినట్లు చెప్పారు. మండలంలోని జన్నేపల్లి, లింగాపూర్, తాడ్‌గామ, మాక్లూర్ మండలం బొంకన్‌పల్లి సెంటర్లకు చెందిన పలువురు సిబ్బందికి మెమో జారీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో రాథోడ్ తుకారాం

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దాడులు

- రూ. 25 లక్షల విలువ చేసే ఆల్ప్రాజోలం, క్లోరల్ హైడ్రేట్ స్వాధీనం
- ఐదుగురు నిందితుల అరెస్టు.. పరారీలో మరో ముగ్గురు

వివరాలను వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సోమిరెడ్డి

వినాయక్‌నగర్, మే 6 : జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిషేధిత మత్తుపదార్థాల రవాణా చేయడంతోపాటు నిల్వ చేయడం, విక్రయాలు చేస్తున్న వారిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సోమవారం దాడి చేశాయి. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సోమిరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మూడు టీములతో వివిధ ప్రాంతాల్లో దాడులు చేసినట్లు తెలిపారు. దాడుల్లో గొల్లపల్లి యాదగిరిగౌడ్, తాటికొండ నర్సయ్య, గడ రాజేశ్‌కుమార్, సుప్పని నవీన్‌కుమార్ గౌడ్, షేక్ హుస్సేన్ ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 25 లక్షల విలువ చేసే 2.32 కిలోల ఆల్ప్రాజోలంతో పాటు 0.530 గ్రాముల క్లోరల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీరితోపాటు మత్తుపదార్థాల విక్రయాలతో సంబంధం ఉన్న మరో ముగ్గురు చెగ్గారి రాజేందర్ గౌడ్, చేవూరి నాగరాజు గౌడ్, నెమోడి శంకర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు చంద్రభానునాయక్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు పి.స్వప్న, ఏ.వెంకటేశ్, ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది నారాయణరెడ్డి, భోజన్న, రాంబచన్ తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

రెండో ర్యాండమైజేషన్ పూర్తి

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మే 6 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో రెండో ర్యాండమైజేషన్ సోమవారం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. ఆర్మూర్, బోధన్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనంగా 15 చొప్పున కంట్రోల్ యూనిట్లు, బాల్కొండకు 40, నిజామాబాద్ అర్బన్‌కు 35, నిజామాబాద్ రూరల్‌కు 20 కంట్రోల్ యూనిట్లు అందుబాటులో ఉంచామని కలెక్టర్ వివరించారు. కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం సాంకేతిక సమస్యలు ఏర్పడిన సీయూలను బట్టి అదనపు యూనిట్లను కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

అజయ్ బగ్గాలిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి/ సిరికొండ,మే 6 : ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన రజక సంఘాల సమితి నగర అధ్యక్షుడు అజయ్ బగ్గాలి తిరిగి సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. సిరికొండ మండలంలోని న్యావనంది బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సామ సురేందర్ బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు నారవోయిన శ్రీనివాస్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.

కేసీఆర్ రోడ్‌షోకు తరలిన నాయకులు



ధర్పల్లి నుంచి నిజామాబాద్‌కు తరలుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

ధర్పల్లి/ ఇందల్వాయి/ సారంగాపూర్/ మోర్తాడ్/ మాక్లూర్, మే 6 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు వివిధ మండలాలు, గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ధర్పల్లి, ఇందల్వాయితో నుంచి ఎంపీపీలు నల్ల సారిక, రమేశ్ నాయక్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. రూరల్ నుంచి బీఆర్ఎస్ మండల నాయకుడు మధుకర్‌రావు, ఎంపీపీ అనూషా ప్రేమ్‌దాస్, జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, మాక్లూర్ మండలాల నుంచి టీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో బయల్దేరి వెళ్లారు.

దేశాన్ని ప్రైవేట్ పరం చేయడమే బీజేపీ లక్ష్యం

- **మాజీ విప్ ఈరవత్రి అనిల్**

కంఠేశ్వర్, మే 6 : దేశాన్ని ప్రైవేట్‌పరం చేయడమే బీజేపీ లక్ష్యమని మినరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు హాజరైన అమిత్ షా.. ప్రజలకు ఉపయోగపడే హామీలు ఇస్తారనుకుంటే, పాత అబద్ధాలే చెప్పారని అన్నారు. పసుపుబోర్డు జీవో ఎక్కడ, దాని విధి విధానాలేంటి, గతంలో చెప్పిన బీడీ కార్మికులకు ప్రత్యేక దవాఖాన ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. నిజామాబాద్ రైతులు ఆత్మాభిమానం ఉన్నవారని, అర్వింద్‌ను కచ్చితంగా ఓడిస్తారని అన్నారు.

సంక్షిప్తంగా..

- **సైనిక్‌స్కూల్‌కు నాగాపూర్ విద్యార్థి ఎంపిక-** మోర్తాడ్, మే 6: కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి పాలెపు రవికిరణ్ కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక్‌స్కూల్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల నవోదయలో కూడా సీటు సాధించాడు. రెండింటికీ సెలెక్ట్ కావడంపై ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.
- **వడదెబ్బపై అవగాహన కరపత్రాల ఆవిష్కరణ-** రెంజల్, మే 6 : వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు ఆరోగ్య చైతన్య వేదిక, ఇందూర్ మదర్ హుడ్ హస్పిటల్ సౌజన్యంతో రూపొందించిన కరపత్రాలను మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో మండల వైద్యాధికారిణి ఫిర్దోస్ సోమవారం ఆవిష్కరించారు. అత్యవసరమైతే తప్ప ఎండలో బయటికి వెళ్లొద్దని ఆమె సూచించారు.
- **డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం-** మోర్తాడ్, మే 6: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ పెద్దన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల వద్ద ఉచితంగా దోస్త్ ఆన్‌లైన్ సర్వీస్ ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
- **చెరువులో పడి యువకుడి మృతి -** మాక్లూర్, మే 6 : జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీకి చెందిన విశాల్ బాబు (24) ప్రమాదవశాత్తు మండలంలోని బోర్గాం చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్నేహితులతో కలిసి మద్యం సేవించిన అనంతరం చెరువులో కాళ్లు, చేతులు కడుక్కునే క్రమంలో కాలుజారి నీటిలో పడి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా విశాల్ బాబు మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.
- **అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి-** కోటగిరి, మే 6 : మండలంలోని ఎత్తొండకు చెందిన వన్నెల నాగయ్య (42) సోమవారం ఉదయం అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. ఎస్సై సందీప్ కథనం మేరకు.. ఎత్తొండకు చెందిన నాగయ్యకు, తన భార్య లక్ష్మి మధ్య తరచూ గొడవలు జరిగేవి, తన అన్న చనిపోయాడని తెలియడంతో అతడి తమ్ముడు వన్నెల సత్యం ఇంటికి వెళ్లి చూసేసరికి నాగయ్య అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడు. వదిన లక్ష్మితో పాటు ఇతరులపై అనుమానం ఉన్నదని, మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.
- **వేసవి శిబిరం ప్రారంభం -** రుద్రూర్, మే 6 : మండలకేంద్రంలోని నగరేశ్వరి ఆలయంలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో వేసవి శిబిరం ప్రారంభించారు. యజ్ఞ నిర్వహణ, యోగా, కర్రసాము చేయించారు. సంస్కృతం, గణితంపై చిన్నారులకు అవగాహన కల్పించినట్లు విశ్వనాథ్ మహాజన్ తెలిపారు.
- **ఆర్థిక సాయం అందజేత** –ఇందల్వాయి, మే 6 : మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సంపంగి మహేందర్ రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. అంత్యక్రియల నిర్వహణ కోసం బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి కుటుంబానికి సోమవారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు.